# కార్మికులను పెనుప్రమాదంలోకి నెడుతున్న ర్యాట్‌హోల్ మైనింగ్

**బొగ్గు** నిక్షేపాలను అధికంగా కలిగివున్న పది ప్రధాన రాష్ట్రాలలో మేఘాలయ ఒకటి. బొగ్గుగనుల తవ్వకాల వలన సంభవించే ప్రమాదాలు, పర్యావరణానికి కలుగుతున్న హాని కారణంగా 'గ్రీన్ ట్రిబ్యునల్' (హరిత న్యాయ స్థానం) మేఘాలయ రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలపై నిషేధం విధించింది. అయినప్పటికీ రాష్ట్రంలో అక్రమంగా, చట్టవిరుద్ధంగా బొగ్గుగని తవ్వకాలు సాగుతూనే వున్నాయి. అక్రమంగా బొగ్గు తవ్వకాలు సాగించే గనులలో అధిక భాగం పాలక రాజకీయనేతలు, ఉన్నతాధికారవర్గం, పోలీసు ఉన్నతాధికారుల యాజమాన్యంలో వున్నాయి. కనుక, సహజంగానే గనుల యజమానులైన వీరికి, ప్రభుత్వానికి మధ్యనున్న సన్నిహిత సంబంధాల కారణంగా రాష్ట్రప్రభుత్వం ఈ గనులవైపు దృష్టి సారించటంగానీ, ఇక్కడ కార్మికులకు కనీస భద్రత, రక్షణలు కల్పిస్తున్నారా లేదా అనే అంశాన్ని పట్టించుకోవటంగానీ జరగకపోగా, గనుల యజమానుల ప్రయోజనాల పరిరక్షణకే కట్టుబడి నడుస్తోంది.

నీతి నియమాలేలేని గనుల యజమానులు, నిరాశతోకూడిన కార్మికులతో చట్టభీతి లేకుండా ప్రమాదకరమైన ర్యాట్‌హోల్ మైనింగ్ (ఎలుక కలుగులాగా వుండే రంధ్రంద్వారా భూగర్భంలోకి చొచ్చుకువెళ్ళి బొగ్గు తవ్వకాలు సాగించటం) సాగిస్తూ వస్తున్నారు. రాష్ట్రంలో అనేక ర్యాట్‌హోల్ మైనింగ్ చేస్తున్న గనులలో, కార్మికులకు ఏవిధమైన రక్షణ చర్యలు కల్పించకపోవటంవల్ల అనేకమంది కార్మికుల మరణాలు సంభవిస్తూ వున్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన యువకులకు మరో జీవనాధారం, ప్రత్యామ్నాయం లేకపోవటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ గనులలో పని చేయటానికి సిద్ధమౌతున్నారు. ఈ గనులలో తవ్వకం సాగించినందుకుగానూ రోజుకు 1200 రూ॥నుండి 1500 రూ॥వరకు ఆశజూపటంతో కూడా నిరుపేద యువకులు మరేమీ ఆలోచించ కుండా ప్రాణప్రమాదంతో కూడుకున్నదైనప్పటికీ ఈ పనికి సిద్ధమౌతున్నారు. ఈ గనులలో పనిచేయటానికి సిద్ధపడినవారికి అధికవేతనం ఆశజూపినప్పటికీ, వారికి చెల్లింపు చేయటంలో నియంత్రణ లేకపోగా, అక్కడ కూడా వారు దోపిడీకి గురౌతున్నారు. వారు తరచుగా పూర్తి స్థాయి వేతనాన్ని పొందలేకపోగా, కట్టు బానిసల్లాగా చూడబడుతున్నారు. ఈ గని కార్మికులలో అత్యధికులు భూమి హీనులైన దిగువ అస్సాము, మేఘాలయల 'గారో' కొండప్రాంతపు ముస్లిములుగా వున్నారు. గనుల ప్రమాదాల సమయంలో మరణించిన కార్మికు లకు యాజమాన్యాలు ఎలాంటి నష్టపరిహారం చెల్లించటం లేదు.

మేఘాలయలో ముఖ్యంగా జైన్షియా కొండల్లో, గారో కొండల్లో ఈ ర్యాట్‌హోల్ మైనింగ్ అధికంగా సాగుతోంది.

ర్యాట్‌హోల్ మైనింగ్ కోసం భూఉపరి తలంపైనున్న వృక్షాలను తొలగించి శుభ్రం చేస్తారు. తర్వాత 5 నుండి 100 చదరపు మీటర్ల పరిధికలిగిన గోతులను బొగ్గు నిక్షేపాలు తగిలేవరకు తవ్వుతారు. ఈ ర్యాట్‌హోల్స్ ద్వారా (భూగర్భంలో సమాంతరంగా ఒక మనిషి మాత్రమే పట్టటానికి వీలున్న ఈ కలుగుల్లోకి దూరి) బొగ్గు తవ్వకాలయి సాగిస్తారు. కార్మికులు ఈ ర్యాట్‌హోల్స్‌లో ప్రవేశించి బొగ్గు నిక్షేపాలున్న చోటికి చేరుకుంటారు. చాలా తరచుగా ఈ ర్యాట్‌హోల్స్ నీటితో ముంచెత్తివేయబడి కార్మికులు అందులో చిక్కుకుపోయి భూగర్భం లోనే కన్నుమూయటం జరుగుతోంది.

ఇటీవల, 2018 డిసెంబర్ 13న, మేఘాలయ, తూర్పు జైన్షియా కొండల్లోని ర్యాట్‌హోల్ బొగ్గుగనిలో 15 మంది కార్మికులు చిక్కుకుపోయారు. సమీపంలోని లైటియన్ నదిలో నీరు ర్యాట్‌హోల్ నిండా ముంచెత్తటంతో ఈ దుర్ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన ర్యాట్‌హోల్ మైనింగ్ కార్మికుల దుస్థితిని మరోమారు వెల్లడిచేసింది. కార్మికుల రక్షణకు పూచీపడవలసిన రాష్ట్రప్రభుత్వాల, వారి అధికార యంత్రాంగాల నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని మరోమారు వెలుగులోకి తెచ్చింది.

థాయ్‌లాండ్‌లో ఇటీవల ఓ ఫుట్‌బాల్ టీమ్ ఓ గుహలో నీటిలో చిక్కుకుపోయినపుడు, ఆ దేశప్రభుత్వం, సాంకేతిక సిబ్బంది చూపిన బాధ్యతాయుత వైఖరిని, శ్రద్ధను, నీటిలో చిక్కుకుపోయిన వారిని రక్షించేవరకు అవిశ్రాంతంగా కృషి సాగించి విజయం సాధించటాన్ని మన పాలకులు కూడా ఘనంగా స్తుతించారు. అయితే, అదే పాలకులు ర్యాట్‌హోల్ మైనింగ్‌లో చిక్కుకుపోయిన కార్మికుల ప్రాణాలను కాపాడటంలో ఆ శ్రద్ధను కనపరచక పోగా, అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

చాలా గొప్పగా ప్రస్తుతించబడే ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు కూడా కార్మికులను కాపాడేందుకు ఏమీ చేయలేకపోయాయి. ఆ కార్మికులను కాపాడేందుకు తగిన పరికరాలు తమవద్ద లేవని చేతులెత్తేశారు. గనులనుండి 100 హెచ్.పి. సామర్థ్యంతో వరదనీటిని తోడివేయగలిగిన మోటార్ల కొరతని సాకుగా చూపారు. సంఘటన జరిగి రెండునెలలు కావస్తున్నా తగిన, అవసరమైన చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేవీ చేపట్టలేదు.

మేఘాలయ రాష్ట్రంలో ర్యాట్‌హోల్ మైనింగ్‌లో కార్మికులు చిక్కుపడి, జలసమాధి కావటం ఇదే మొదటిసారి కాదు.

2012, 2014 సం॥లలో గారో కొండల లోని బొగ్గుగనుల తవ్వకాలలో ఇలాంటి ఘటనలే రెండు జరిగి దాదాపు 25 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

పర్యావరణపరంగా తీవ్రహానికారకమైన కారణంగానూ, కార్మికుల ప్రాణప్రమాదం పొంచి వున్న కారణంగానూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ 2014 ఏప్రిల్ 17నుండి మేఘాలయ రాష్ట్రంలో అశాస్త్రీయమూ, చట్టవిరుద్ధమై, హానికారకమైన బొగ్గుగనుల తవ్వకాలను నిషేధించింది.

అయితే రాష్ట్రప్రభుత్వం అక్రమంగా సాగించే ఈ ర్యాట్‌హోల్ మైనింగ్‌ను కొన సాగిస్తూ, గనుల యజమానుల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి వుంది. బొగ్గుగనుల విభాగంలో ఈ విధమైన 'ప్రమాదాల'లో బొగ్గుగని కార్మికులు మరణించటమనేది చాలా సాధారణ విషయంగా మారిపోయింది.

బొగ్గుగనులలో వరదలు సంభవించి కార్మికులు ప్రాణాలు కోల్పోయిన మూడు ప్రముఖ ప్రమాదాలను ధన్‌బాద్‌కు చెందిన ఐఐటి, ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ బృందం అధ్యయనం చేసి, వాటి వివరాలను 2016లో ప్రచురించింది. ఇందులో మానవతప్పిదాన్నే బాధ్యతగా నిర్ధారించే అధికారిక వైఖరే అనుసరించబడింది. కనుక మూలకారణాన్ని కనుగొనే ప్రయత్నమే ఈ నివేదికలో చేయలేదు.

గనుల భద్రతకు సంబంధించినశాఖ యొక్క డైరెక్టర్ జనరల్ కార్యాలయం అందించిన వివరాల ప్రకారం, 2016 నుండి బొగ్గుగనుల ప్రమాదాలలో మరణిస్తున్న కార్మికుల సంఖ్య మన దేశంలో 40 శాతం చొప్పున పెరుగుతూ వస్తోంది.

"వేగంగా అభివృద్ధిచెందుతున్న మన ఆర్థిక వ్యవస్థ"యొక్క వాస్తవ ముఖచిత్రమిది! బొగ్గుగనుల యజమానుల నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా, కార్మికులకు కనీసభద్రత, రక్షణ చర్యలను చేపట్టని బాధ్యతారాహిత్యం కారణంగా, కార్మికుల భద్రతను తనిఖీచేసి, కార్మికుల హక్కులకు గ్యారంటీ నివ్వవలసిన ప్రభుత్వాల, ప్రభుత్వ యంత్రాంగాల పట్టనితనం కారణంగా, కార్మికుల ప్రాణాలు ప్రతిరోజూ గాలిలో కలిసి పోతున్నాయి. ఎన్నో చట్టాలద్వారా కార్మికుల భద్రతకు ఎంతో చేశామని చెప్పే పాలకుల గొప్పగొప్ప ప్రకటనలన్నీ డొల్లకబుర్లేనని ఆచరణలో రుజువౌతోంది.

అయితే, కార్మికుల భద్రతపట్ల ప్రభుత్వ యంత్రాంగపు ఈ పట్టనితనం కేవలం సంబంధిత అధికారుల లేదా పరిపాలకుల తప్పిదం మాత్రమే కాదు. గుప్పెడుమందిగా నున్న పాలకవర్గాల అధీనంలోని దోపిడీవ్యవస్థ మూలల్లోనే ఇమిడివున్న దోపిడీ వర్గ స్వభావం యొక్క ఫలితంగా దీనిని గుర్తించాలి.

దీనికితోడు, మనదేశంలో కార్మికోద్యమం అనేక బలహీనతలగుండా సాగుతోంది. కార్మికుల వాస్తవిక జీవన్మరణ సమస్యలను చేపట్టి, ఆ సమస్యల పరిష్కారంకోసం తుదికంటా పోరు సాగించటంలో బలహీనతలనెదుర్కొంటోంది.

పెట్టుబడిదారీ వర్గాలకు, వారి వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికవర్గ చైతన్యంతో కార్మికులు ఐక్యంగా, నిలకడగా పోరాటం చేయటం ద్వారానే, ఈ తరహా 'గనుల ప్రమాదాల' మరణాలను అరికట్టి, విలువైన కార్మికుల ప్రాణాలను కాపాడటం సాధ్యమౌతుంది.

`

oooo